





# ఇల్లు కట్టేది ఎలా..?

- నిర్మాణ సామగ్రి ధరలు పైపైకి
- ప్రతి ఏటా పెరుగుతున్న ఐరన్, సిమెంట్ ధరలు

నిర్మాణ రంగానికి ఎంతో అవసర మున్న సిమెంట్, ఐరన్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రతి ఏటా ఐరన్, సిమెంట్ ధరలు పెరుగుతుండడంతో సామాన్యులకు ఇంటి నిర్మాణం భారంగా మారుతోంది. వీటితో పాటు పోటాపోటీగా ఇసుక, కూలీల, మేస్త్రీల ధరలు సైతం పెరుగుతుండడంతో ఇల్లు కట్టేదెలా అని ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ధరలతో పేద మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కల కలగానే మిగిలిపోయే పరిస్థితి నెలకొంటుంది.

- బెల్లంపల్లి

వివరాలు 7

## ధర్నాకు కూలీలు తరలిరావాలి

కోటపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు ఉపాధి హామీ కూలీలందరు తరలిరావాలని వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ బోడెంకి చందు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కావిరి రవి కోరారు. బుధవారం మండలంలోని వెల్మపల్లి, లక్ష్మీపూర్, అర్జునగుట్ట గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ ఉపాధికూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. పాత బకాయిలు విడుదల చేయాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని, సిబ్బందికి పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొత్త జాబ్‌కార్డులు ఇవ్వాలని, ప్రస్తుతం ఉన్న జాబ్ కార్డుల్లో కొత్త పేర్లు నమోదు చేయాలనే డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## 3 నుంచి భూ భారతి గ్రామసభలు

కోటపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో జూన్ 3వ తేదీ నుంచి 20వతేదీ వరకు భూభారతి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాఘవేంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 37రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామసభలు ఉంటాయని తెలిపారు. భూసమస్యలున్న వారు సభల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.



బస్సులను పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు

# బడి బస్సులు భద్రమేనా..?

- నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులు
- ఫిట్‌నెస్ లేకున్నా రోడ్లపైకి వాహనాలు
- నామమాత్రంగా రక్షణ చర్యలు
- ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో వెల్లడి

మంచిర్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల బస్సుల్లో యాజమాన్యాలు విద్యార్థుల భద్రతను గాలి కొదిలేస్తున్నాయి. ఫిట్‌నెస్‌లేని బస్సులు నడుపుతూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. విద్యా సంస్థల బస్సుల్లో పిల్లల రక్షణకు సంబంధించి చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఫిట్‌నెస్ తనిఖీ సమయాల్లో నిబంధనలు పాటిస్తున్నప్పటికీ, ఆ తరువాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జూన్12 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానుండగా, ఆలోపే విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ ప్రక్రియ పూర్తి చేసుకోవలసి ఉంది. మూడు రోజులుగా ఆర్టీఏ అధికారులు బస్సుల తనిఖీలు చేపడుతుండగా, యాజమాన్యాల నుంచి సరియైన స్పందన లభించడంలేదు. జిల్లావ్యాప్తంగా 380 విద్యాసంస్థల బస్సులు ఉండగా, ఇప్పటి వరకు కేవలం 35 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. ఫిట్‌నెస్ పరీక్షలకు వెళితే అధికారులు బస్సులను సీజ్ చేస్తారేమోననే ఉద్దేశంతోనే వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల తనిఖీల్లో అనేక బస్సుల్లో లోపాలు బయట పడుతుండటం గమనార్హం.

**● గ్రిల్స్ తప్పనిసరి...**

బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల భద్రత కోసం బస్సుకు మూడు వైపులా తప్పనిసరిగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. ముఖ్యంగా పాఠశాలల బస్సుల్లో ప్రయాణించేది చిన్నపిల్లలు కావడంతో బస్సు కదిలేటప్పుడు కిటికీల నుంచి చేతులు బయటకు చాచకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. గ్రిల్స్ లేని కారణంగా..

మిగతా 7లో

## గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి



ఎర్రోజుల చంద్రమౌళి(ఫైల్)

జన్నారం, మే 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందనపల్లి పంచాయతీ కార్యదర్శి ఎర్రోజుల చంద్రమౌళి(58) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన చంద్రమౌళి రెండు సంవత్సరాలుగా ఇందనపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఆయన పంచాయతీ కార్యదర్శుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, పనిభారంతో ఆందోళన గురై గుండె పోటుతో మృతి చెందాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన ఇటీవల జరిగిన సరస్వతీ పుష్కరాలలో విధులు నిర్వహించారు. సంవత్సరం నుంచి గ్రామ పంచాయతీలకు ఎటువంటి నిధులు రాకపోవడంతో తన సొంత డబ్బులు ఖర్చుపెట్టారని, ఏరియర్స్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఆయనకు భార్య పద్మ, కొడుకు ఉదయ్, కుమార్తె మేఘన ఉన్నారు.

## కార్యదర్శి మృతికి సంతాపం

మందమర్రిరూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జన్నారం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ గుండెపోటుతో మృతిచెందిన చంద్రమౌళి మృతికి మందమర్రి మండల పంచాయతీ కార్యదర్శులు బుధవారం సంతాపం తెలిపారు. పనిఒత్తిడి, ఆర్థిక భారంతో గుండెపోటుకు గురై మృతిచెందాడని, ప్రభుత్వం ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఎంపీడీవో రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం దుర్మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

చెన్నూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం దుర్మార్గమైన చర్యఅని అరుణోదయ కళాకారిణి, ప్రజాఉద్యమాల పోరాటసమితి అధ్యక్షురాలు విమలక్క పేర్కొన్నారు. బుధవారం చెన్నూరు పట్టణంలోని పద్మశాలి భవన్‌లో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పోచమల్లు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు కాంతయ్య ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసన కార్యక్రమ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం సరైంది కాదన్నారు. నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని పేర్కొన్నారు. నక్సలైట్ల పేరుతో అమాయక ఆదివాసీ గిరిజనులపై మారణహోమం సాగించడం ఆపాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులను, 1/70చట్టాన్ని కాపాడాలని కోరారు. అడవి సంపదను, ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగా సల్వాజుడుం, ఆపరేషన్ కగార్ పేరుతో ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం సిగ్గుచేటని తెలిపారు. ఎన్‌కౌంటర్లు చేస్తూ చనిపోయిన వారి మృతదేహాలను కూడా బంధువులకు అప్పగించకపోడం దుర్మార్గమన్నారు. ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగావెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, నాగిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం, ఐఎఫ్‌టీయూ రాష్ట్రకార్యదర్శి భాస్కర్, విశ్వనాథ్, సత్యం, ఆదివాసీ నాయకులు కుమార్, సాధు, మల్లన్న, అంజయ్య, చంద్రశేఖర్, జైపాల్ సింగ్, బోడంకి చందు, చంద్రశేఖర్, పోలు, సమ్మయ్య, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## చిర్రకుంటలో కూలిన ఇల్లు



మందమర్రిరూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): చిర్రకుంట గ్రామంలోని దుర్గం ప్రమీల ఇల్లు మంగళ వారం రాత్రి కూలిపోయింది. ప్రమీల తన ముగ్గురు పిల్లలతో కలిసి జీవిస్తోంది. కురుస్తున్న వర్షాలకు గోడలునాని ఇల్లు కూలిపోయింది. ప్రమీల మాట్లాడుతూ తాను కూలీ పనులు చేసుకుని పిల్లలను పోషించుకుంటున్నానని, తనకు ఇల్లుకొనే ఆర్థిక స్థోమత లేదని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కూలిన ఇంటిని ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. ప్రభుత్వం తరుపున సయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## గురుకులాల్లో అత్యుత్తమ విద్య

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

మందమర్రిటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకుల విద్యాలయాలు రాష్ట్రంలో యువతకు అత్యుత్తమ విద్యఅవకాశాలు కల్పించడమే కాకుండా మానసిక, శారీరక, సాంస్కృతిక అభివృద్ధికి చేయూతనందిస్తున్నాయని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ గురుకుల విద్యాలయ సాంఘిక సంక్షేమ సంఘం (టీజీఎస్‌డ బ్ల్యూఆఐ ర్‌ఎస్)అవార్డు సన్మాన కార్యక్ర మానికి ఆయన హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రధా నంగా గురుకులాల ద్వారా రాష్ట్ర భవిష్యత్ పటిష్ఠ నిర్మాణం అవుతుందని, దేశ వ్యాప్తంగా ప్రతిభను చాటుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యాభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు అందరు కృషి చేయాలని కోరారు.

## తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు ఎన్టీఆర్

మంచిర్యాల కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు నందమూరి తారకరామారావు అని కమ్మ సేవాసమితి గౌరవ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, జిల్లా అధ్యక్షులు వడ్డెపల్లి వినయ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీముఖ్యమంత్రి ఎన్టీరామారావు జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని లక్ష్మీటాకీస్ వద్ద బుధవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, గడ్డె శ్రీనివాస్, శ్రీహరి, బెనర్జీ, మల్లేశ్వర్‌రావు, ప్రసాద్, అనిల్‌కుమార్, సుభాస్‌చంద్రబోస్, రవీందర్‌రావు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు మణిరాంసింగ్ మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బడుగు, బలహీనవర్గాల ప్రజలకోసం అనేక సంక్షేమపథకాలకు ప్రవేశపెట్టిన మహనీయుడని పేర్కొన్నారు. అనంతరం కేక్‌కట్‌చేసి టీడీపీ నాయకులు ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, రమేశ్, దాసరి శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో కేక్‌కట్ చేసి తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు

## మాదిగ హక్కుల దండోర రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాంపెల్లి రాజం

బెల్లంపల్లి,మే28(ఆంధ్రజ్యోతి): మాదిగ హక్కుల దండోర రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన కాంపెల్లి రాజంను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునిల్ నియామక పత్రాన్ని అందజేశారు. మాదిగ హక్కుల కోసం ఎల్లవేళలా ముందుంటానని కాంపెల్లి రాజం తెలిపారు. అనంతరం కాంపెల్లి రాజంను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, కిరణ్, రాజలింగు, కాంపెల్లి సతీస్, మహేందర్, నరేశ్, కుమార్‌లు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



ఎర్రవాగు వంతెన వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

- కలెక్టర్ కుమార్‌దీపక్

నెన్నెల, మే 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం కలెక్టర్ నెన్నెల మండలంలో పర్యటించారు. భారీ వర్షానికి దెబ్బతిన్న ఎర్రవాగు తాత్కాలిక వంతెనను పరిశీలించారు. వాగు ఉధృతిని తట్టుకునేలా తాత్కాలిక కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులు పూర్తిచేసి ప్రారంభిస్తే ప్రజల కష్టాలు తీరుతా యన్నారు. బ్రిడ్జిపనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. జంగాల్‌పేట పంచాయతీ పరిధిలోని కొత్తగూడంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. అర్హులైనవారికి పథకం అందేలా..

(మిగతా 7వ పేజీలో..)

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

నెన్నెల, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం మంజూరు పత్రాలు అందజేశారు. నందులపల్లి, గొళ్లపల్లి, మైలారం గ్రామాల్లో ఇళ్లకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. నిర్మాణం పనులు పూర్తి చేసుకుంటే దశల వారిగా బిల్లులు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యోగా అవగాహన శిబిరం



నస్పూర్‌లో యోగా కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

నస్పూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఆయూష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవరణలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 21వ తేదీ వరకు ప్రతి ఒక్కరికి యోగాపై అవగాహన కల్పించాలని నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వెంకటేశ్వర్లు, డీపీఎం రాథోడ్ రవీందర్, జిల్లా ఆయూష్ మెడికల్ ఆఫీసర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజా, యోగా శిక్షకులు సుధాకర్, మేఘన, ఫార్మసిస్టు పుష్పాంజలి, ఎస్‌సీఎస్ కిషన్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# కాలువలు ఇలా.. నీరు పారేదెలా?

- శిథిలావస్థలో 30వ డిస్ట్రిబ్యూటరీ సిమెంట్ లైనింగ్ కాలువ డ్రాప్‌లు





వెంకటాపూర్ శివారులో సిమెంట్ లైనింగ్ పూర్తిగా చెడిపోయిన 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ, తానిమడుగులో..


దండేపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు డిస్ట్రిబ్యూటరీ, ఉపకాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వానాకాలంలో ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందుతుందో లేదో అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తం అవుతున్నాయి. కడెం ప్రాజెక్టు, గూడెం ఎత్తిపోతల పథకం నీటిని పంట పొలాలకు అందించడంకోసం దండేపల్లి మండలంలోని ఏర్పాటు చేసిన సాగునీటి కాల్వలు అక్కడక్కడ శిథిల మయ్యాయి. డీ22, 25, 28, 30 డిస్ట్రిబ్యూటరీ కాలువల డ్రాప్‌లు, సిమెంట్ లైనింగ్‌లు ధ్వంసమయ్యాయి. కొన్నిచోట్ల నీరు ముందుకెళ్లడం ఇబ్బందిగా మారింది. పైగా డీ30 కాల్వలో పలు చోట్ల సిమెంట్ లైనింగ్ దెబ్బతిని పెద్దపెద్ద బొంగలు ఏర్ప డ్డాయి. తుంగ గడ్డి మొలవడంతో సాగునీటి సరఫరాకు కొంత ఇబ్బందిగా మారింది. ప్రధాన కాలువలు..

(మిగతా 7వ పేజీలో..)

## కొర్రమీను సాగుకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలకలెక్టరేట్, మే28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మత్స్య పరిశ్రమల్లో పని చేస్తున్న అర్హులైన వారి నుంచి కొర్రమీను సాగు చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఔత్సాహికులు, మత్స్యకారులు, మత్స్యరైతులు, హోల్‌సేల్, రిటైల్ చేపల విక్రయదారులు, చేప పిల్లలు ఉత్పత్తి చేసేవారిలో ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోపు దరఖా స్తులు చేసుకోవాలని కోరారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా సాధారణ 40 శాతం, ఎస్సీ, ఎస్టీ, మహిళ క్యాటగిరి 60 శాతం రాయితీపై మూడు హచరి యూనిట్లు, 10హెక్టార్లు చేపల పెంపకం చెరువులు మంజూరు చేస్తామని తెలిపారు. సమాచారం కొరకు జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్8లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

# వైద్యుల కొరత రోగుల కలత



**బెజ్జూరు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో అరకొర సేవలు**

**పూర్తి స్థాయి సిబ్బంది లేక ఇబ్బంది**

**పట్టించుకోని అధికారులు**


బెజ్జూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని సర్కారు దవాఖానాలో వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా మెరుగైన వైద్యం అందక రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. సిబ్బంది కొరత తీర్చి తగిన వసతులు కల్పించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో మారుమూల పేద ప్రజలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో వర్షాలు కురుస్తున్నందున అదే రీతిలో సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం కూడా ఉంటుంది. ముఖ్యంగా గ్రామాల్లో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు సరైన వైద్యం అందక పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో సరైన వైద్య సిబ్బంది లేక ప్రతి ఏటా వర్షాకాలంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

**స్థాయి పెంచినా..**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మూడేళ్ల క్రితం సీహెచ్‌సీగా స్థాయి పెంచి 30 పడకల ఆసుపత్రిగా మార్చారు. కేవలం స్థాయి మాత్రమే పెంచినా ఇప్పటికీ హెచ్‌ఆర్ స్టేటస్ రాకపోవడం, క్యాడర్ స్ట్రెంత్ అమలుకు నోచుకోక అవస్థలు తప్పడం లేదు. ఇక్కడి ఆరోగ్య కేంద్రంలో ప్రతినిత్యం 100కుపైగా ఓపీ ఉంటుంది. కేవలం ఒక్కరు మాత్రమే డాక్టర్ ఉండడంతో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. వాస్తవానికి కనీసం నలుగురు వైద్యులు ఉండాలి. కానీ ప్రభుత్వం చర్యలు తీసుకోక పోవడంతో రోగులకు అరకొర సేవలే అందుతున్నాయి. ఆసుపత్రిలో రెగ్యులర్ స్టాఫ్‌నర్సులు కూడా లేక ఇతర ప్రాంతాల నుంచి రోజువారీగా వంతులుగా విధులను కేటాయిస్తున్నారు. రెగ్యూలర్ ఎల్టీ కూడా లేరు. ఓపీ ఏఎన్‌ఎంలు కూడాలేరు. దీంతో ఉన్న వారితోనే నెట్టుకొస్తున్నారు. ఉన్నతాధికారులు తనిఖీల సమయంలో వచ్చినప్పుడు ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెబుతూ ఆపై సమస్యను పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.

**సీజనల్ వ్యాధులు ప్రబలితే..**

వర్షాలు కురిసి వరదలు పెరిగితే గ్రామాల్లో ప్రబలి తే మరిన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. అసలే మారుమూల ప్రాంతం కావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందక దూరప్రాంతానికి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలోని మారుమూల ప్రాంతమైన బెజ్జూరులో వైద్యులు పని చేయాలన్నా ఇష్టపడడం లేదు. దీంతో గత కొన్ని ఏళ్లగా వైద్యుల పోస్టులు భర్తీ కాకపోవడంతో ఇక్కడ వైద్యం అందకుండా పోతోంది. మండల కేంద్రంలోని ఆసుపత్రి స్థాయి పెంచినా వసతుల కల్పనలో మాత్రం శ్రద్ధ చూపకపోవడంతో వైద్యం దైన్యంగా మారింది. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలోని ఆసుపత్రిలో మరో డాక్టర్‌ను అదనంగా ఏర్పాటు చేయాలని, పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



బెజ్జూరు పీహెచ్‌సీ

## శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

- బుద్దె స్వామి, రెబ్బెన సీఐ



**ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ**

**ఆంధ్రజ్యోతి:** శాంతిభద్రతల పరిరక్షణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

**సీఐ:** శాంతి భద్రత పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ ఒక్కరికి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. పాత నేరస్తులపై నిఘా పెడుతున్నాం. ప్రత్యేక టీంలతో పెట్రోలింగ్ చేస్తున్నాం. రాత్రి వేళ్లలో గస్తీ కూడా ముమ్మరం చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** సైబర్ నేరాలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

**సీఐ:** ఫైబర్ నేరాల పట్ల ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాం. ఆన్‌లైన్ మోషాలపై కూడా వివరిస్తున్నాం. అనవసరపు లింకులు వాట్సాప్‌లో వస్తే ఓపెన్ చేయకూడదని తెలియజేస్తు న్నాం.

**ఆంధ్రజ్యోతి:** గంజాయి నివారణకు ఎ లాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**సీఐ:** యువత గంజాయి వాడకుండా ముందస్తు అన్నీ చర్య లు తీసుకుంటాం. యువతకు గంజాయి వాడితే తలెత్తే అనార్థాల ను వివరిస్తున్నాం. ప్రతి ఒక్కరూ లక్ష్యం చేరుకునేందుకు క్రమశిక్ష ణతో చదువుకోవాలని సూచిస్తున్నాం.

- రెబ్బెన, ఆంధ్రజ్యోతి

## జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు

ఆసిఫాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తహసీల్దార్లను బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులను జారీ చేశారు. బదిలీలలో భాగంగా వాంకిడి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రియాజ్ ఆలీని ఆసిఫాబాద్‌కు బదిలీ చేశారు. వాంకిడి తహసీల్దార్‌గా కవిత, పెంచికల్‌పేట తహసీల్దార్‌గా పుష్పలత, కౌటాల తహసీల్దార్‌గా ప్రమోద్, లింగాపూర్ తహసీల్దార్‌గా నాగరాజు గౌడ్‌ను నియమిం చారు. బెజ్జూరు తహసీల్దార్‌గా రామ్మోహన్‌రావు, తిర్యాణి తహసీల్దార్‌గా ఆర్ శ్రీనివాస్, కెరమెరి తహసీల్దార్‌గా భూమేశ్వర్, దహెగాం తహసీల్దార్‌గా మునావర్ షరీఫ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెబ్బెన తహసీల్దార్‌గా సూర్యప్రకాష్, చింతలమా నేపల్లి తహసీల్దార్‌గా కె రమేష్, సిర్పూర్(టి) తహసీల్దార్‌గా రహిమొద్దిన్, సిర్పూర్ (యు) తహసీల్దార్‌గా ప్రహ్లాద్, కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా ఎం మధుకర్‌ను నియమించారు. వీరితో పాటు డి వెంకటేశ్వర్‌రావు, సూర్యనారాయణ, కిరణ్‌కుమార్‌లను కలెక్టరేట్‌లో వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం అయా మండలాల్లో తహసీల్దార్లుగా బాధ్యతలు స్వీకరించారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ



చెన్నూరులో తనిఖీ చేస్తున్న సీఐ, వ్యవసాయాధికారులు

చెన్నూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణంలోని ఎరువుల దుకాణాలను బుధవారం పోలీసులు, వ్యవసాయాధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లను, స్టాకు నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ దేవేందర్‌రావు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు. రశీదులు ఇవ్వకుండా అమ్మరాదని, కొన్న ప్రతి రైతుకు రశీదులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

**కన్నెపల్లి (ఆంధ్రజ్యోతి):** కన్నెపల్లి మండంలోని టేకులపల్లి, సుర్జాపూర్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఏడీఏ సురేఖ తనిఖీ చేశారు. ఎరువుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీవోఎస్ మిషన్ ద్వారానే విక్రయించాలని, రైతుల ఆధార్ కార్డు తీసుకున్న తర్వాతనే ఎరువులను విక్రయించాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆమె వెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

## ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం తనిఖీ

మందమర్రిరూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారిణి కిరణ్మయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి విత్తనాలు ఎవరైనా తీసుకువస్తే వారి సమాచారం వ్యవసాయాధికారులకు, పోలీసులకు అందించాలని కోరారు. తనిఖీల్లో ఏఈవో ముత్యం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## రసవత్తరంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

హాజీపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శనివారం పోటీల్లో భాగంగా 13వ బెటాలియన్‌లో ఏడీసీఏ వైట్ టీం మొదటి ఇన్నింగ్స్‌లో 147 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 238 పరుగులు చేయగా బ్లూటీం మొదటి ఇన్నింగ్స్‌లో 212 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 128 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. కాగా వైట్‌టీం గెలుపొందింది. ఇందులో సాయిక్రిష్ణరెడ్డి 103 పరుగులు, శ్రీకాంత్‌రెడ్డి 107 పరుగులు చేశారు. మందమర్రిలో జరిగిన సెకండ్ మ్యాచ్‌లో ఏడీసీఏ గ్రీన్‌టీం మొదటి ఇన్సింగ్‌లో 309 పరుగులకు ఆలౌట్ కాగా రెడ్ టీం 117 పరుగులకు ఆలౌట్ అయింది. గ్రీన్‌టీం రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయి డిక్లెర్ చేయగా రెడ్ టీం 190 పరుగులకు ఆలౌట్ అయింది. కాగా గ్రీన్‌టీం 134 పరుగుల తేడాతో గెలుపొంది. ఎ. సంతోష్ 249 పరుగులు చేసి ఆకట్టు చేసుకున్నారు. మూడో మ్యాచ్ మంచిర్యాల ఉషోదయ స్కూల్‌లో నిర్వహించగా ఆరెంజ్ టీం మొదటి ఇన్నింగ్స్‌లో 325 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయి డిక్లేర్ చేసింది. ఎల్లో టీం 298 పరుగకుల 9 వికెట్లు కోల్పోయింది. రెండో ఇన్సింగ్స్‌లో ఆరెంజ్ టీం 270 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయింది. ఎల్లో టీం 161 పరుగులకు ఆలౌట్ అయింది. మొదటి బ్యాటింగ్ చేసిన ఆరెంజ్‌టీం 136 పరుగులు చేసింది. దర్శన్ అగర్వాల్ మొదటి ఇన్సింగ్స్‌లో 114 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 105 పరుగులు చేశాడు. శ్రీచరణ్ 141 పరుగులు చేశాడు. రహమాన్ మొదటి ఇన్సింగ్స్‌లో ఐదు, రెండో ఇన్సింగ్స్‌లో 6 వికెట్లు తీశారు.

## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ ఇవారి, డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీజర్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కలెక్టరేట్ భవనాన్ని విద్యుత్ దీపాలతో సుందరీకరించాలని, చిల్డ్రన్స్ పార్కులో గల అమర వీరుల స్థూపాన్ని ముస్తాబు చేయాలని, వేదికను పూలతో అలంకరించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారిని ఆదేశించారు. వేడుకల సమయంలో నిరంతరం విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుధ్యం, ప్రముఖుల గ్యాలరీ ఏర్పాటు పనులు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. వేడుకలకు హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలను వేడుకలకు ఒక రోజు ముందే విద్యుత్ కాంతులతో ముస్తాబు చేయాలని సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని, వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి కలెక్టరేట్ ఆవరలో వేడుకల నిర్వహణ స్థలాన్ని పరిశీలించారు.



వేడుకల ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అధికారులు

**వన మహోత్సవం పకడ్బందీగా చేపట్టాలి**

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతూ భావిత రాలకు సహజ వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం-2025 కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి, డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్‌తో కలిసి వన మహోత్సవం కార్యక్రమంపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఈ సంవత్సరం 51 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించిందని చెప్పారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, డీపీవో భిక్షపతి, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం తనిఖీ

సిర్పూర్(టి), మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రహీముద్దీన్ బుధవా రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఉన్న మ్యాచర్ వచ్చిన దాన్యం వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు పంపాలని సూచించారు. రైస్ మిల్లులకు పంపించిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి 48 గంటలలో డబ్బులు వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు.

## రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీఏవో రబ్బానీ

దహెగాం, మే 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కొనుగోళ్లు రెండు రోజుల్లో పూర్తి చేయాలని డీసీఏవో రబ్బాని అన్నారు. మండలంలోని ఖర్జీ, గిరివెల్లి గ్రామల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనంగా హమాలీలను ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియ వేగంగా చేయాలని పీపీసీ ఇన్‌చార్జీలను ఆదేశించారు. ధాన్యం తడవకుండా టార్పాలీన్ కవర్లు, కనీస వసతులు కల్పించాలన్నారు. రైతుల ధాన్యాన్ని సరిపడా గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏవో రామకృష్ణ, ఏఆర్ శామూయల్, ఏఈఓలు సుస్మిత, పీఏసీఎస్ కార్యదర్శి నారాయణ, పీపీసీ ఇన్‌చార్జి నర్సింహా, రైతులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న ఏవో నాగరాజు

బెజ్జూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవ ని వ్యవసా యాధికారి నాగరాజు, అన్నారు. మండలంలోని సోమిని, బెజ్జూరు, పోతెపల్లి, పాపన్నపేట, బారెగూడ తదితర గ్రామాల్లో బుధవారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో రికార్డులు, స్టాక్ పరిశీలించారు. రైతులకు విత్తనాలు అమ్మిన వెంటనే రశీదు ఇవ్వాలని చెప్పారు. రైతులంతా కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి రశీదులు దగ్గర ఉంచుకోవాలని సూచించారు.. నకిలీ పత్తి విత్తనా లను విక్రయించినా, ప్రోత్సహించినా సంబంధిత దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

## ఐఎన్‌టీయూసీని విమర్శించే అర్హత లేదు



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య

మందమర్రిటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : నిరంతరం కార్మికుల హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ఐఎన్‌టీయూసీ నేత, రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ జనక్ ప్రసాద్‌తో పాటు తమ యూనియన్‌ను విమర్శించే అర్హత ఎవరికి లేదని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు, క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సరస్వతి పుష్కరాల సందర్భంగా పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు అవమానం జరిగిందని దళిత సంఘలు ధర్నా చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎంపీకి అవమానం జరిగితే పార్లమెంట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపా రు. కానీ ఇక్కడ దళితుల మధ్య చిచ్చు పెడుతున్నది ఎవరో అర్థం చేసుకోవాలన్నారు. పార్టీకి అండగా ఉంటున్న నాయకులపై ఆ రోపణలు చేయడం సరి కాదని తెలిపారు. ప్రాణహిత కాలనీకి చెందిన ఓ దళితుడు ఎమ్మెల్యే వద్ద మెప్పు కోసం మాట్లాడితే ఎవరు ఊరుకోరని, ఆయన చరిత్ర అంతా అందరికి తెలుసన్నారు. కావాలని ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. త్వరలోనే అన్ని విషయాలు బయట పెడతామన్నారు. కార్మికులందరికి వాస్తవాలు తెలుసని రాబోయే రోజుల్లో తమకు కూడా ఏం చేయాలో తెలుసన్నారు. ఈ సమావేశంలో నాయకులు భూమయ్యనరేందర్, వెంకటస్వామి, శంకర్‌రావు, బుచ్చయ్య, ఓదెలు, భిక్షపతి, తిరుపతి, రాములు,బాపు, స్వామి, శ్రీకాంత్, భాస్కర్, బాలకృష్ణ, దుర్గా ప్రసాద్, మహేందర్, రవి ప్రసాద్, గోపి, కమల్, అనిల్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో లోపాలు రావద్దు



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేట్ జీఎం చీఫ్‌లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్

మందమర్రిటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించినటువంటి పదోన్నతుల రూల్‌ఆఫ్ రిజర్వేషన్లలో ఎలాంటి లోపాలు రాకుండా చూసుకోవాలని ఎస్సీ కార్పొరేట్ జీఎం చీఫ్‌లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్ అన్నారు. స్థానిక జీఎం కార్యాలయంలో బుధవారం మందమర్రి ఏరియాలో జీఎం కార్యాలయాన్ని సందర్శించారు. ఏరియాలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ప్రవేశపెట్టిన రిజర్వేషన్లను తప్పకుండా అమలు చేయాల్సిందేని ఆయన అన్నారు. ఎస్సీ ఉద్యోగులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నవాటి పరిష్కారానికి అధికారులు చొరవచూపాలని చెప్పారు. ఎస్సీ రోస్టర్‌రికార్డులను తనిఖీ చేశారు. మొదటి సారి మందమర్రికి వచ్చిన ఆయనను ఏరియా అధికారులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఏరియా జీఎం దేవేందర్, ఏరియా పీఎం శ్యాం సుందర్, డీపీఎం మైత్రేయబందు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. ఈ రాజేశ్వర్‌రావు, కార్పొరేట్ వైస్‌ప్రెసిడెంట్ ఎం వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.




## టీబీజీకేఎస్ పిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) శ్రీరాంపూర్ ఓసీపీ పిట్ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఉప ప్రధాన కార్యధ్శ బండి రమేష్, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య హాజరయ్యారు. పిట్ కార్యదర్శిగా గడ్డం సుధాకర్, సహాయ కార్యదర్శిగా జంగం రమేష్, జనరల్ షిఫ్ట్ కార్యదర్శిగా రామగిరి సంపత్, రిలే కార్యదర్శులుగా పెట్టం సారయ్య, వెంకన్న, సత్యనారాయణ, మహిళా విభాగం కార్యదర్శులుగా స్రవంతి, అక్షయ, హేమలత, ఎంవీ డ్రైవర్స్ బాధ్యులుగా శ్యాంకుమార్, తిరుపతి, బ్లాస్టింగ్ సెక్షన్ బాధ్యులుగా మేకల రవి, వెంకటేష్, జలంధర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెట్టం వినోద్, మారం శ్రీనివాస్, అగ్గు తిరుపతి, నిఖిల్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని సిబ్బంది



కాసిపేట ఒకటో గని కార్యాలయంలో హాజరు కాని సిబ్బంది

కాసిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): కాసిపేట గనిలో ఆఫీసు సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాసిపేట ఒకటో గని మేనేజర్ కార్యాలయ సిబ్బంది ఉదయం 7గంటల 30 నిమిషాలకు సిబ్బంది అందుబాటులో ఉండాలి. ఉదయం 8గంటలు దాటినప్పటికీ ఎవరు ఆఫీసులో లేకపోవడం వల్ల నైట్ డ్యూటీ విధులు నిర్వహించిన కార్మికులు అధికారులు ఎవరు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. రాత్రిడ్యూటీ చేసిన కార్మికులు ఆఫీసు నిమిత్తం కార్యాలయానికి వెళ్తే అధికారులు ఎవరు అందుబాటులో ఉండడం లేదని చెబుతున్నారు. సాయంత్రం కూడా దూరప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తే ఖాళీ కుర్చీలే కనిపిస్తున్నాయని చెబుతున్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

**మండల విద్యాధికారి గుండ్ల శైలజ**



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఎలా ఉంది..?

**ఎంఈవో:** ప్రభుత్వ పాఠశాలల్లో మంచి నాణ్యమైన విద్యను అందజేయడం జరుగుతుంది. ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తుంది.

**ఆంధ్రజ్యోతి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఏలాంటి సౌకర్యాలు ఉన్నాయి..?

**ఎంఈవో:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి అనుభవాజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన. అంతే కాకుండా విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫాంతో పాటు మధ్యాహ్నం సన్నబియ్యంతో రుచి కర మైన భోజనం కూడా అందజేయడం జరుగుతుంది.

**ఆంధ్రజ్యోతి:** మన మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో విద్యార్థుల సంఖ్య ఎంత. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

**ఎంఈవో:** లక్షెట్టిపేట మండలంలో మొత్తం 57ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో సుమారు 4285మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈఏడాది ఇంకా విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మన బడి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పట్టణాల్లో మన బడి కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై అవగాహన కల్పింస్తాం.

**ఆంధ్రజ్యోతి:** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు మీరు ఇచ్చే సూచనలు ఏంటి..?

**ఎంఈవో:** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు సూచనల మేరకు పాఠశాలల నిర్వహణ ఉండేలా చూసుకోవాలి. పాఠశాలల ప్రారంభం కనుక ముఖ్యంగా బుక్స్ అమ్మకాలు జరిపితే ఊరుకునేది లేదు. అర్హత ఉన్న సిబ్బందితో మాత్రమే విద్యార్థులకు విద్యా బోధన అందించే విధంగా పాఠశాలల యాజమాన్యాలు సిద్ధం చేసుకోవాలి. అనుభవం, అర్హత లేని సిబ్బందితో పాఠశాలలు కొనసాగిస్తే చర్యలు తప్పవు.

- లక్షెట్టిపేట, ఆంధ్రజ్యోతి



**పెరిగిన ఇసుక, ఇతర సామగ్రి ధరలు..**

ఇంటి నిర్మాణ రంగంలో సిమెంట్ ఐరన్‌తో పాటు ఇసుక సైతం ఎంతో అవసరం. గత ఏడాది ట్రాక్టర్ ఇసుక 2,100 రూపాయలు ఉం డగా ప్రస్తుతం దూరబారాన్ని బట్టి 2,500 రూపాయల నుంచి 3,500 రూపాయల వరకు ధర పలుకుతోంది. ఏకంగా ట్రాక్టర్ లోడ్‌కు 1,000 రూపాయల వరకు పెరిగింది. అలాగే ఇంటినిర్మాణానికి ఉపయోగించే ఇటుకలు, టైల్స్ మార్బుల్స్ స్టోన్స్ కలర్స్, పీవీసీ పైపులు సైతం ధరలు పెరిగాయి. అలాగే టేకు దర్వాజలు, తలుపులు, కిటికీల ధరలు సైతం పెరగడంతో సామాన్యులు ఇళ్లు కట్టాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నిర్మాణం చేపట్టే క్రమంలో 30లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందని పనులు చేపడుతుండగా మరో 10 లక్షల వరకు అదనంగా ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు ఇంటి నిర్మాణం చేపట్టే మేస్త్రీలు, కూలీల ధరలు సైతం పెరిగాయి. దీంతో ఇంటి నిర్మాణ దారులు ఇబ్బందులు పడుతున్నారు.

# ఇల్లు కట్టేదెలా?

- **నిర్మాణ సామగ్రి ధరలు పైపైకి**
- **ప్రతి ఏటా పెరుగుతున్న ఐరన్, సిమెంట్ ధరలు**
- **నిర్మాణదారులపై పడుతున్న భారం**

బెల్లంపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగానికి ఎంతో అవసరమున్న సిమెంట్, ఐరన్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రతి ఏటా ఐరన్, సిమెంట్ ధరలు పెరుగుతుండడంతో సామాన్యులకు ఇంటి నిర్మాణం భారంగా మారుతోంది. వీటితో పాటు పోటాపోటీగా ఇసుక, కూలీల, మేస్త్రీల ధరలు సైతం పెరుగుతుండడంతో ఇల్లు కట్టేదెలా అని ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అప్పులు చేసి ఇల్లు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మరి కొందరు ధరల పెరుగుదలతో మధ్యలోనే ఇంటి నిర్మాణాలు నిలిపివేస్తున్నారు. పెరిగిన ధరలతో పేద మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కల కలగా నే మిగిలిపోయే పరిస్థితి నెలకొంటుంది.

### సిమెంట్, ఐరన్ ధరలు పైపైకి...

ఇల్లు నిర్మించాలంటే సిమెంట్, ఐరన్ తప్పనిసరి. సిమెంట్ ఐరన్ ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో ఆకాశన్నంటుతున్నాయి. గత ఏడాది అక్టోబరు నెలలో సిమెంట్ బస్తా రూ.250 నుంచి 300కు పెరిగింది. ప్రస్తుతం సిమెంట్ ధర రూ.340 నుంచి 360 వరకు ఉంది. ఏకంగా ఏడాది కాలంలోనే సిమెంట్ ధర సుమారుగా వంద రూపాయల వరకు పెరిగింది. అలాగే సిమెంట్ పీపీసీ, ఓపీసీ గ్రేడ్ ఆధారంగా ధరలు పలుకుతున్నాయి. పీపీసీ కంటే ఓపీసీ సిమెంట్ బస్తాకు ఆయా కంపెనీ నుంచి 40 నుంచి 50 రూపాయల వరకు ధర ఎక్కువగా ఉంటుంది. అలాగే సిమెంట్‌తో పాటు ఐరన్ ధరలు సైతం ఆకాశన్నంటుతున్నాయి.

గత ఏడాది ఐరన్ ధర టన్నుకు ఆయా కంపెనీని బట్టి 51వేల రూపాయల నుంచి 53వేల రూపాయల వరకు ఉండగా ప్రస్తుతం టన్నుకు 60వేల రూపాయల నుంచి 62వేల రూపాయల వరకు పలుకుతోంది. ఒకేసారి టన్ను ఐరన్ ధర ఎనిమిది వేల రూపాయల నుంచి తొమ్మిది వేల రూపాయల వరకు పెరగడంతో నిర్మా ణదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నిర్మాణ రంగంలో ఎక్కువగా సిమెంట్, ఐరన్‌ను ముడి సరుకుగా ఉపయోగిస్తారు.

### నిర్మాణ దశలోనే ఆగుతున్న ఇళ్లు..

**రామచంద్రయ్య, తాపీ మేస్త్రీ, బెల్లంపల్లి**



ఇంటి నిర్మాణానికి ఉపయోగించే అన్ని ధరలు రోజు రోజుకు పెరుగుతుండడంతో ఇల్లుకట్టేవారు ఇబ్బందులు పడుతున్నారు. 30లక్షలలో ఇంటి నిర్మాణం పూర్తవుతుందని పనులు ప్రారంభిస్తున్నారు. కాని ధరలు పెరగడంతో మరో పది లక్షల రూపాయలు అదనంగా ఇల్లుకట్టేవారికి ఆర్థిక భారం పడుతోంది. కొందరు నిర్మాణదారులు ఇళ్లను మధ్యలోనే నిలిపి వేస్తున్నారు.

### అదనంగా పదిలక్షలు ఖర్చు అయింది...

**బాలసాయికృష్ణ, బెల్లంపల్లి**



ఇల్లు నిర్మాణం ప్రారంభించిన సమయంలో సిమెంటు రూ.310 ఉండగా ప్రస్తుతం 60 నుంచి 70 పెరిగింది. దీనికి తోడు ఐరన్, ఇసుక, ఇటుక ధరలు సైతం పెరగడంతో నా ఇంటి నిర్మాణానికి మరో పది లక్షలు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇల్లు కట్టాలంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పెరిగిన ఇంటి నిర్మాణ సామగ్రిధరలను తగ్గించాలి.



## ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టండి

మందమర్రిటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణం మధ్యలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని కోరుతూ చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి తరలివెళ్లి కాంగ్రెస్ నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ నాయకులు వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడం మూలంగా ప్రజారోగ్యానికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి 50పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. ఆయనతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కాలువలు ఇలా.. నీరు పారేదెలా?

(5వ పేజీ తరువాయి..)



కూలిన డి30 డిస్ట్రిబ్యూటరీ కాలువ సిమెంట్ లైనింగ్

డిస్ట్రిబ్యూటరీ కాలువలపై సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరి అయకట్టు చివరకి సాగునీరు అందడంలేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సాగునీటి కాల్వలో చెత్తను తొలగించడంతో పాటు శిథిలమైన కాల్వల లైనింగ్‌లు, డ్రాప్‌లకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- **కాలువల మరమ్మతుల కోసం కృషి..**

**- వెంకటేశం, ఏఏఈ, నీటి పారుదలశాఖ**

దండేపల్లి మండలంలోని నెల్కివెంకటాపూర్, తానిమడుగు 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ, ఉపకాలువల లైనింగ్‌లు, డ్రాప్‌ల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. నిధులు మంజూరైతే మరమ్మతులు చేపడతాము.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

(5వ పేజీ తరువాయి..)

లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం పనులను ఎప్పటిప్పుడు రికార్డు చేస్తూ బిల్లులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ అటవీ శాఖవారు అడ్డుకుంటున్నారని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. జోగాపూర్, ఆవడం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం ఎప్పటికప్పుడు కాంటా వేసి కేటాయించిన రైసు మిల్లులకు తరలించాలని సూచించారు. అవసరమైన గోనెసంచులను సమకూరుస్తామని తెలిపారు. ధాన్యం సేకరణ లక్ష్యాన్ని త్వరగా చేరుకునేలా నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఎంఆర్ఐ సులోచన, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం విజయలక్ష్మి, ఎస్సై ప్రసాద్ ఉన్నారు.

### నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో జిల్లాలోని చెరువులు పూర్తి స్థాయిలో నిండి పంటలకు, ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో నీటి పారుదల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకా లంలో జిల్లాలో కురిసే భారీ వర్షాల కారణంగా జిల్లాలోని చెరువుల్లోని నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువులు 90శాతం నిండగానే సంబంధిత అధికారిక గ్రూప్‌లో సమాచారం అందించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటిపారుదలశాఖ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల తో సమీక్షించారు. కార్యక్రమంలో నీటిపారుదల ఎస్ఈ విష్ణుప్రసాద్, చెన్నూర్ డివిజన్ల డీఈఈలు, ఏఈఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలి

చెన్నూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం చెన్నూరులోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని, మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### సైబర్ మోసాలపై అవగాహన

భీమారం, మే 28 (ఆంధ్రజ్యోతి): భీమారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బూరుగుపల్లి, భీమారం, ఆరేపల్లి గ్రామాల్లో సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కళాజాతా బృందం సభ్యులు ఆట, పాటల ద్వారా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఎస్‌బీఐ మేనేజర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బకాయిలను వెంటనే చెల్లించాలి

జైపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో సబ్ కాంట్రాక్టర్‌గా పనిచేసిన స్టిగ్ సంస్థ నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే కాంట్రాక్టు కార్మికులకు చెల్లిం చాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులును కలిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ తుకారాం, హెచ్ఎంఎస్ ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 3 నుంచి ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

మంచిర్యాలకలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్ 3వ తేదీ నుంచి ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3, 4, 5, 6, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. 3వ తేదీ ఫస్ట్ లాంగ్వేజ్ పార్ట్1, 2 పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం, 12.50 గంటల వరకు 9, 10 తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించామని, వైద్య సిబ్బందిని నియమించామని తెలిపారు.

## ఘనంగా హరిత యోగా దినోత్సవం



కోటపల్లి పీహెచ్‌సీలో మొక్కలు నాటుతున్న యోగా శిక్షకులు, చిన్నారులు

కోటపల్లి, మే 28 (ఆంధ్రజ్యో తి): అంతర్జాతీయ యోగా ది నోత్సవంలో భాగంగా హరిత యోగా దినోత్సవాన్ని కోటపల్లి లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా షెడ్ వద్ద మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని యోగా శిక్షకులు రాజబాబు, మమతరాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**నస్పూర్ (ఆంధ్రజ్యోతి):** నస్పూర్ జిల్లా పరిషత్ పాఠశాల అవరణలో బుధవారం హరిత యోగా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల అవరణ, మండల విద్యాధి కారి కార్యాలయం ఎదుట మొక్కలను నాటారు. మొక్క లను నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని వైద్యులు సూచించారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు తీవ్ర నష్టం

**మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

నెన్నెల, మే 28 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోవడానికి ప్రభుత్వమే కారణమని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. మండలంలోని మైలారం, గొళ్లపల్లి గ్రామాల్లో దుర్గం చిన్నయ్య బుధవారం పర్యటించారు. వర్షానికి తడిసిన ధాన్యం కుప్పలను పరిశీలిచారు. బాధిత రైతులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కోతలు కోసి ధాన్యం కొనే వారి కోసం రైతులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారన్నారు. ఎప్పటికప్పుడు ధాన్యం సేకరించి మిల్లులకు తరలిస్తే వర్షాలతో రైతులకు నష్టం జరిగేది కాదన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పంజాల సాగర్‌గౌడ్, నాయకులు ఎండీ ఇబ్రాహీం, ఇందూరి రమేష్, మేకల మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, ప్రేమ్‌సాగర్, తిరుపతిగౌడ్, శివప్రసాద్, శంకర్ తదితరులు ఉన్నారు.



గొల్లపల్లిలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

### పిడుగు పడి రెండు గేదెలు మృతి

జైపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లి గ్రామానికి చెందిన తుంగపిండి రాజేష్‌కు చెందిన రెండు గేదెలు పిడుగు పడి మృతిచెందాయి. మంగళవారం మేతకు వెళ్లిన గేదెలు ఇంటికి రాకపోవడంతో చేన్లలో గాలించగా శెట్‌పల్లి శివారులో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి గేదెలపై పిడుగు పడి మృతిచెందాయని పేర్కొన్నాడు. గేదెల విలువ రెండు లక్షల రూపాయలు ఉంటుందని తెలిపాడు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందించాలని రాజేష్ కోరాడు.

### డీటీగా బాధ్యతల స్వీకరణ

మందమర్రిరూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మందమర్రి డిప్యూటి తహసీల్దార్(డీటీ)గా సంతోష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సంతోష్ పెద్దపల్లి నుంచి మందమర్రికి బదిలీపై వచ్చారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన రవీందర్ పెద్దపల్లికి బదిలీ అయ్యారు.

## పాఠశాలలను మూసివేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): లండన్ కిడ్స్ పాఠశాల, స్వామి వివేకానంద పాఠశాలలను మూసివేయాలని కోరుతూ డీఈవో యాదయ్యకు పీడీఎస్‌యూ నాయకులు బుధవారం వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఇళ్లనే పాఠశాలలుగా మార్చి లండన్‌కిడ్స్ స్వామి వివేకానంద పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా విద్యాశాఖ అధికారులకు తెలియకుండా పాఠశాల యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న లండన్స్ కిడ్స్, వివేకానంద పాఠశాలలను మూసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

## ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజం: ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాష్

లక్షెట్టిపేట, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ అనేది సహజమని మంచిర్యాల అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ) ఆర్. ప్రకాష్ అన్నారు. లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక ఓ ఫంక్షన్ హాలులో లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం పోలీసులు వీడ్కోల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి లో ముఖ్య అతిధిగా ఏసీపీ ప్రకాష్ హాజరై మాట్లాడారు. 15 నెలలు విధులు నిర్వహించిన సీఐ నరేందర్ ఇక్కడి జనానికి ఎంతో సేవలందించారని కొనియాడారు. అనంతరం సీఐ అల్లం నరేందర్‌ను సీఐలు, ఎస్సైలతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మంచిర్యాల టౌన్ సీఐ ప్రమోద్ రావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేష్, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట ఎస్సైలు రాజవర్ధన్, తహసీయోద్దీన్, గోపతి సురేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెల్ల నాగభూషణం, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, దండేపల్లి మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పోడు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

వేమనపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): పోడు రైతులందరికి బ్యాంకు రుణాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాగాల రాజన్న, ఎర్మ పున్నంలు పేర్కొన్నారు. బుధవారం వేమనపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యా లయం నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు వరకు ర్యాలీ నిర్వహించి బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోడు పట్టాలు కలిగిన ఆదివాసీ రైతులకు క్రాప్‌లోన్ ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. పోడు రైతులు కొన్ని సంవత్సరాలుగా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా రుణాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పోడు రైతులందరికి ఖాతాలు గ్రామీణ బ్యాంకులోనే ఉన్నాయని వెంటనే వీరికి రుణాలు ఇవ్వాలని కోరారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మర్మల మల్లేశ్వరి, మండల అధ్యక్షుడు మడె మధునయ్య, నాయకులు తలండి ముత్తయ్య, కొమురెల్లి, కిరణ్, నారాయణ, గంగారాం, పార్వతి, పోశం, మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

# బడి బస్సులు భద్రమేనా?

- **నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులు**
- **ఫిట్‌నెస్ లేకున్నా రోడ్లపైకి వాహనాలు**

(5వ పేజీ తరువాయి)

ప్రయాణ సమయంలో విద్యార్థులు చేతులు బయట పెట్టిన పక్షంలో ఇతర వాహనాల ద్వారా ప్రమాదం జరిగే అవకాశం ఎంతైనా ఉంది.

### నామమాత్రంగా ఫైర్ ఎస్టింగిషర్లు?

అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం సంభవించి బస్సులో మంటలు చెలరేగిన పక్షంలో వాటిని ఆర్పేందుకు ఫైర్ ఎస్టింగిషర్లు అందుబాటులో ఉండాలి. అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తీసుకొని బస్సుల్లో ఫైర్ ఎస్టింగిషర్లు ఏర్పాటు చేయాలి. అయితే బస్సులో ఫైర్ ఎస్టింగిషర్స్ కనిపిస్తున్నప్పటికీ, నామ మాత్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. అత్యవసర సమయాల్లో అవి పని చేస్తాయో..జలేదో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి.

### ప్రథమ చికిత్స డబ్బాలో కానరాని పరికరాలు..

విద్యాసంస్థల బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అందులో ప్రథమ చికిత్సకు సంబంధించి ఎలాంటి పరికరాలు ఉండటం లేదని తెలుస్తోంది. ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో తప్పనిసరిగా కాటన్, అయోడిన్, స్పిరిట్ బాటిల్, బ్యాండేజ్ ఉండాలనే నిబంధన ఉంది. బస్సుల్లో తదితర వస్తువులు ఉన్నప్పటికీ అవి కాలం చెల్లి ఉండటం గమనార్హం. చిన్నచిన్న ప్రమాదాలు జరిగినప్పుడు విద్యార్థులకు ప్రథమ చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉపయోగపడతాయి. వీటితో పాటు విద్యార్థులు బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. డ్రైవరుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫోటో పేరు, సెల్ నంబర్ విధిగా ప్రదర్శించాలనే నిబంధన ఉంది.

### ఊసేలేని డ్రైవర్ల మెడికల్ సర్టిఫికెట్లు..

పాఠశాల బస్సుల్లో పనిచేసే డ్రైవర్లకు రెండు సంవత్సరాలకు ఒకసారి వైద్య చికిత్సలు చేయించి మెడికల్ సర్టిఫికెట్ అందుబాటులో ఉంచాలి. కాని ఈ విషయమై యాజమాన్యాలు దృష్టి సారించడంలేదని సమాచారం. డ్రైవర్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు యాజమాన్యాలు ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉంటుంది. అలాగే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ఐదు సంవత్సరాల అనుభవం ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించుకోవాలనే నిబంధన కూడా ఉంది. లైట్లు, హ్యాండ్ బ్రేక్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు, పసుపుపచ్చ రంగు కలిగి ఉండాలి.

### ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి: రంజిత్, ఎంవీఐ



జిల్లాలో సుమారు 400 బస్సులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం 35 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. జూన్ 12 నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభం ఉన్నందున యాజమాన్యాలు స్పందించాలి. నిర్ణీత గడువులోగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోకుండా బస్సులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాము.

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## కుమరం భీం
జిల్లా వార్తలు




### రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

కెరమెరి, మే 28 (ఆంధ్రజ్యోతి): రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏఈవో ప్రభావతి అన్నారు. మండలంలోని ధనోర రైతు వేదికలో బుధవారం ఆమె దనోర, మురికిలొంక తదితర గ్రామాల రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు తమ పట్టాలను ఆధార్, ఫోన్ నంబర్‌తో అనుసంధానం చేయించడం వల్ల సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు అధికారులను సంప్రదించి నమోదు చేయించుకోవాలని ఏఈవో సూచించారు.

### అర్హులను ఎంపిక చేయాలి

ఆసిఫాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన వారిని ఎంపిక చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో రాజీవ్ యువ వికాసం పై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా రూ.50 వేల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను ఎంపిక చేసి జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో మంజూరు పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. నియోజక వర్గ కేంద్రాలలో రూ.50 వేల వరకు గల యూనిట్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యేల ద్వారా మంజూరు పత్రాలు అందించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సముదాయంలో గల వీసీ కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో రూ.50 వేల లోపు గల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన జాబితాను ఇన్‌చార్జి మంత్రి సంతకాలు తీసుకుని జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సాయంత్రం నియోజక వర్గ కేంద్రాలలో ఎమ్మెల్యేలతో కలిసి మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధకారి దత్తారావు, ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### 2 నుంచి స్లాట్ బుకింగ్ సేవలు

ఆసిఫాబాద్‌రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు సబ్ రిజిస్ట్రార్ అప్పారావు తెలిపారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి రోజు 48 స్లాట్ బుక్కింగ్‌లకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 24 స్లాట్లు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 24 స్లాట్‌లు ఉంటాయన్నారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి త్వరలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి వేలి ముద్రతో పాటు ఈ-సిగ్నేచర్ అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు. దీంతో అక్రమాలకు తావు లేకుండా ఉంటుందన్నారు. స్లాట్ బుకింగ్ లేని వారికి సాయత్రం 5 నుంచి 6 గంటల మధ్యలో రోజుకు ఐదు రిజిస్ట్రేషన్‌లు మాత్రమే చేయనున్నామని తెలిపారు.

### భూములను వదిలేది లేదు



తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్థులు

చింతలమానేపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలు పోయినా సరే.. తమ భూములను వదిలేది లేదని దిందా గ్రామస్థులు అధికారులకు తేల్చి చెప్పారు. బుదవారం అటవీ శాఖ అధికారులు కర్జెల్లి రేంజ్ పరిధిలో దిందా, బండలేటి, తదితర అటవీ ప్రాంతాల్లోని బీట్లలో ఎక్స్‌కావేటర్ సహాయంతో ట్రెంచ్ వేసి మొక్కలు నాటేందుకు ప్రయత్నాలు సాగిస్తున్న క్రమంలో గ్రామస్థులు, మహిళలు అడ్డుకొని నిరసన వ్యక్తి చేశారు. గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్న తమ భూముల్లో మొక్కలు నాటితే తమ జీవనం ఎలా అని అధికారులను నిలదీశారు. ఎఫ్‌బీడీఓ సుఖ్‌దేవ్ సుశాంత్ బొబడే గ్రామస్థులను సముదాయంచే ప్రయత్నం చేశారు. పోడు భూములు సగం మీకు వదిలి పెట్టి సగం భూముల్లో మొక్కలు వేస్తామని అధికారులు పేర్కొనడంతో గ్రామస్థులు ససేమీరా భూమని వదిలేందుకు తాము సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. సాయంత్రం వరకు వేచి ఉన్న అటవీ అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్లి పోయారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో ఎక్బాల్, ఎఫ్ఎస్ఓ మోహన్, ఎఫ్‌బీవోలు తదితరులు పాల్గొన్నారు.

# నాబార్డు రుణ ప్రణాళిక ఖరారు

- జిల్లాలో రూ.3,233.47 కోట్లతో అమలు
- గత ఏడాది కంటే 11.8శాతం అధికం
- 4.45 లక్షల ఎకరాల్లో పంటల సాగు



జిల్లా రుణ ప్రణాళిక బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులు (ఫైల్)

**జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ద్వారా 2025-26 సంవత్సరంలో అమలు చేసే వార్షిక రుణప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. నూతన ఆర్థిక సంవత్సరంలో అధిక భాగంగా వానాకాలం, యాసంగిల్లో రైతులకు పంటరుణాలు, అనుబంధ టర్మ్ రుణాలుగా ఇవ్వనున్నారు.**

ఆసిఫాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఖరారైంది. ఏటా బ్యాంకుల ద్వారా రైతులు, ఇతర వర్గాల వారికి రుణాలు అందించేందుకు గాను నాబార్డు రుణ లక్ష్యాన్ని ఖరారు చేస్తుంది. దాని ప్రకారం బ్యాంకుల వారీగా వార్షిక రుణ లక్ష్యాలను నిర్దేశిస్తుంది. జి ల్లాలో 2025-26 వార్షిక రుణ ప్రణాళిక రూ..3,233.47 కోట్లతో ఖరారు చేశారు. గతేడాది కంటే ఈఏడాది రూ.3 41.31 పెంచుతూ వార్షిక రుణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో బాగంగా జిల్లాకు సంబంధించి 2025-26 వార్షిక రుణ ప్రణాళిక బ్రోచర్ ను ఇటీవల కలెక్టర్ వెంకటేష్ దోత్రే బ్యాంకర్లతో కలిసి ఆవిష్కరిం చారు. జిల్లా వ్యాప్తంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి అన్ని రంగాలకు కలిపి రూ. 3,233.47 కోట్లు రుణాలు ఇవ్వాలని నాబార్డు ప్రకటించింది. ఇందులో పంట రుణాల కోసం రూ. 1680.67 కోట్లు, వ్యవసాయ, అను బంధ రంగాలకు రూ. 725.58 కోట్లు, చిన్న, మధ్య తరహ పరిశ్రమలకు రూ. 296.4 కోట్లు, ఇతర ప్రాధా న్యత రంగాలకు రూ. 236.91 కోట్లు, ప్రాదాన్యయేతర రంగాలకు రూ. 293.91 కోట్లు రుణాలు చెల్లించాలని లక్ష్యాలను నిర్ధేశించారు.

**● గతం కంటే ఎక్కువగా..**

గత ఏడాదితో పోలిస్తే 11.8 శాతం నిధులు పెంచారు. గతేడాది రూ.2,892.16 కోట్లతో రుణ ప్రణాళిక లక్ష్యంగా ఉంది. ఈ ఏడాది తాజాగా రూ. 3,233.47 కోట్లతో రుణ ప్రణాళిక రూపొందించారు. గతేడాది కంటే ఈఏడాది రూ.341.31 కోట్లు పెంచుతూ వార్షిక రుణ ప్రణాళిక సి ద్ధం చేశారు. వీటిలో పంట రుణాలు రూ.1,680.67 కోట్లు, టర్మ్ లోన్లూ రూ.359.63 కోట్లు, వ్యవ సాయ మౌలిక వసతుల కోసం రూ.104.97 కోట్లు, అనుబంధ కార్యక్ర మాలకు రూ.260.98 కోట్లు కేటాయించారు. ఇలా మొత్తం పంట రుణాలు, వ్యవ సాయ, అనుబంధ రంగాలకు రూ.2406.25 కోట్లు కేటాయించారు.

**● లక్ష్యాలు పెంచినా..**

వ్యవసాయ రుణాలే కాకుండా దాని అనుబంధ రంగా లు, మహిళా సంఘాలు, స్వయం ఉపాధి, చిన్న, మధ్య తరహ పరిశ్రమలు, విద్య, గృహ నిర్మాణం తదితర వాటికి రుణ పంపిణీ కోసం ఏటా ప్రణాళికలు తయారు చేసి బ్యాంకుల వారీగా లక్ష్యాలను కేటాయిస్తున్నారు. పంపిణీకి వచ్చే సరికి కొర్రీలు పెడుతున్నారు. జిల్లాలో 1.39 లక్షల వరకు రైతులు ఉన్నారు. ఈ వానాకాలం సీజన్‌లో 4.45 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. కానీ బ్యాంకుల ద్వారా రుణాలు అందించ డంతో అధికారులు నిబంధనలు చెబుతుండడంతో పట్టాదారులు చాలా మంది ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఏటా సుమారు 70 నుంచి 80వేల మందికే బ్యాంకు రుణాలు అందుతున్నాయి. జిల్లాలో 30వేలకు పైగా కౌలు రైతులు ఉన్నారు. కౌలు రైతుల కు బ్యాంకుల్లో రుణాలు అందక వీరికి వడ్డీ వ్యాపారులే దిక్కవుతున్నారు. ఏటా అప్పులు చేసి కౌలు రైతులు పంటలు సాగు చేయాల్సిన పరిస్థితు లు ఉత్పన్నమవుతున్నాయి. గత ఏడాది రుణ ప్రణాళిక రూ. 2.892.16 కోట్ల లక్ష్యంగా ఉండగా వీటిలో రూ. 1,610 కోట్లు పంపిణీ చేశారు. పంట రుణాల లక్ష్యం గతేడాది 1.621.29 కోట్లు ఉండగా అన్ని బ్యాంకర్లు కలిపి రూ. 907 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు. ఏటేటా లక్ష్యాలను పెంచుతున్నా పంపిణీ మాత్రం సగం వరకే ఉంటుందని ప్రజలు చెబుతున్నారు.

### బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్‌రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా రియాజ్ అలీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన రోహిత్ మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. వాంకిడిలో పని చేస్తున్న రియాజ్ ఆసిఫాబాద్‌కు వచ్చారు.

**వాంకిడి, (ఆంధ్రజ్యోతి):** వాంకిడి తహసీల్దార్‌గా కవిత బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ రియాజ్ అలీ ఆసిఫా బాద్‌కు బదిలీ అయ్యారు. దహెగాం తహసీల్దార్‌గా పని చేస్తున్న కవిత బదిలీపై వాంకిడికి వచ్చారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు.

**కెరమెరి, (ఆంధ్రజ్యోతి):** కెరమెరి తహసీల్దార్‌గా భూమేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన దత్తు ప్రసాద్ పెద్దపల్లి జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో బెజ్జూరులో పని చేస్తున్న భూమేశ్వర్ బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

**సిర్పూర్(టి),(ఆంధ్రజ్యోతి):** సిర్పూర్ (టి) తహసీల్దార్‌గా ఎండీ రహీముద్దీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ శ్రీనివాస్‌ను తిర్యాణికి బదిలీ కాగా తాడ్వాయి నుంచి రహీముద్దీన్ బదిలీపై వచ్చారు.



విధుల్లో చేరిన సూర్యప్రకాష్

**రెబ్బెన, (ఆంధ్రజ్యోతి):** రెబ్బెన తహసీల్దార్‌గా సూర్యప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ రామ్మోహన్ రావు బెజ్జూరుకు బది లీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా సంప్రదించాలని సూచించారు.

# వన్యప్రాణుల రక్షణకు బాధ్యతగా పాటుపడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అడవులతో పాటు వన్యప్రాణుల రక్షణకు బాధ్యతగా పాటుపడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి బుధవారం అటవీ రక్షణ కమిటీ సమావేశానికి హాజరై పోలీసు, రెవెన్యూ పంచాయతీ రాజ్, సింగరేణి, విద్యుత్, అటవీ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అడవిని, వన్యప్రాణులను రక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. జిల్లాలో భూభాగంలో 56 శాతం అడవి ఉందని చెప్పారు. అటవీ ప్రాంతంలో భూమి ఆక్రమణ జరగకుండా అధికారులు సమన్వ యంతో పని చేయాలని తెలిపారు. అటవీ ప్రాంతంలో వేటగాళ్లు విద్యుత్ తీగలను అమర్చి వన్యప్రాణులను హతమారుస్తున్నారని అన్నారు. ఈ చర్యల వల్ల అమాయకులైన వ్యవసాయ రైతులు, కూలీలు విద్యుత్ తీగలకు తగిలి ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. అడవి గుండా వెళ్తున్న విద్యుత్ తీగలను రోడ్డు పక్క నుంచి వెళ్లేలాగా విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరా సౌర గిరి జలశక్తి పథకం ద్వారా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములలో సాగు భూములలో బోరు బావులు వేసి సౌర విద్యుత్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. మారుమూల గ్రామాలను మండల కేంద్రాలకు అనుసంధానించేందుకు రహదారులు, కల్వర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అటవీ, రెవెన్యూ సరిహద్దుల వివాదాలకు త్వరలోనే పరిష్కారం చూపేందుకు ఇరు శాఖల అధికారుల పకడ్బందీగా సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. హద్దులు గుర్తించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావే శంలో విద్యుత్ శా ఖాధికారి శేషరావు, సింగరేణి జీఎం విజయ్‌భాస్కర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్, ఎఫ్ఆర్వో, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ఆసిఫాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు జిల్లాలోని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో స్వచ్ఛభారత్ మిషన్ అగాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల ఎంపీడీవో అధికారులు, ఎంపీవో, సెర్ప్ ఏపీఎం, ఉపాధి హామీ పథకం ఏపీవో, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ఒక రోజు అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిది ద్దడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర చాలా కీలకమని అన్నారు. ప్రతి రోజు పారిశుధ్య పనులు చేపట్టడం, తడి పొడి చెత్తలు సేకరించడం, మురికి నీరు నిలువ లేకుండా చర్యలు, రహదారుల శుభ్రత, ప్రతి ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణం, మురుగు కాలువల శుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా, బహిరంగ మలమూత్ర విసర్జన లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యకరమంలో డీఎల్‌పీవో ఉమర్‌హుస్సేన్, ఎస్ఐఆర్‌డీ రాష్ట్ర సమన్వ యకర్త సభాష్, యూనిసేఫ్ ప్రతినిధి మమాలక్ష్మి, రాష్ట్ర శిక్షకులు రమేశ్, ఆగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు నజీర్, సెల్వరాజ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### అరచేతిలో ఉద్యోగ సమాచారం

**● డీఈఈటీ యాప్‌ను అందుబాటులో తెచ్చిన ప్రభుత్వం**



వాంకిడి, మే 28 (ఆంధ్రజ్యోతి): నిరు ద్యోగ యువతీ యువకులకు ఉ పాధి అవకాశా లు కల్పించ డా నికి ప్రభుత్వం కొత్తగా డీఈఈటీ (డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్సేం జీ ఆఫ్ తెలంగాణ) యాప్‌ను అందుబా టులోకి తీసుకువచ్చింది. నిరుద్యోగుల సెల్‌ఫోన్‌లకు ఆయా కంపెనీటు నేరుగా సమాచారం పంపించి మౌఖిక పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. పరిశ్రమల్లో ఖాళీలు ఏర్పడితే వారు ఈ యాప్ ద్వారా నేరుగా నిరుద్యోగుల సెల్‌ఫోన్‌కు సమాచారం అందిస్తారు. వాస్తవానికి ఈ యాప్‌ను గత ఏడాది నవంబరులో ప్రారంభించారు. అనుకున్న స్థాయిలో ఎవరికీ తెలియదు. దీంతో ఆ యాప్‌కు కృత్రిమ మేద జోడించి మళ్లీ ఇప్పుడు అందుబాటులోకి తీసుకువచ్చారు.

● అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్ డీఈఈటీ. కామ్ వెబ్ సైట్‌లో లా గిన్ కావాలి. పేరు, సెల్‌ఫోన్ నంబరు, మెంయల్ చిరునామా, పుట్టిన తేదీ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్హత, కోర్సులు, ఇంటినంబరు, వ్యక్తిగత వివరాలను పొందుపరచాలి. ఆశించే ఉద్యోగం వివరాలను నమోదు చేసుకోవాలి.

# ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరస్పర సవాళ్లు

**● గృహ నిర్బంధం చేసిన పోలీసులు**

కాగజ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మధ్య సాగుతున్న సవాళ్ల నేపథ్యంలో బుధవారం కాగజ్‌న గర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను బుధవారం తుమ్మిడిహెట్టి వద్దకు బహిరంగ చర్చకు రావాలని మంగళవారం సవాల్ విసిరారు. ఉదయం బహిరంగ సభకు వెళ్లేందుకు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఏర్పాట్లు చేసుకుంటుండగా డీఎస్పీ రామానుజం, సీఐ శ్రీనివాస్ శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని చెప్పి ఎక్కడికి పోనీయకుండా హౌస్ అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన అనుచరులతో కలిసి వెళ్లేందుకు ప్రయత్నించగా సీఐ ప్రేంకుమార్, ఎస్సై సుధాకర్‌తో పాటు సిబ్బంది కలిసి అడ్డుకున్నారు. ఎవరిని పోనీయకుండా హౌజ్ అరెస్టు చేస్తున్నామని చెప్పి మాజీ ఎమ్మెల్యే కోనప్ప నివాసాన్ని పోలీసులు ముట్టడించారు. పరిస్థితి అదుపులోకి వచ్చిందనుకునే లోపు ఒక్కసారి కోనప్ప అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తమనాయకుడిపై ఎమ్మెల్యే అనుచిత వాఖ్యాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. పోలీసులను దాటి ఎమ్మెల్యే నివాసంలో వెళ్లేందుకు పోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు పూర్తి స్థాయిలో భద్రత చర్యలు చేపట్టారు.

**తుమ్మిడిహెట్టికి చేరుకున్న నాయకులు**

**కౌటాల, (ఆంధ్రజ్యోతి):** ఎమ్మెల్యే హరీష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరస్పర సవాళ్ల నేపథ్యంలో బుధవారం తుమ్మిడిహెట్టి వద్దకు వారి వర్గీయులు చేరుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యేను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే కోనప్ప సోదరుడు మాజీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు నాయకులతో కలిసి కౌటాల నుంచి తుమ్మిడిహెట్టి వద్దకు మోటారు సైకిళ్లపై వెళ్తుండగా కౌటాల ఈసీఐ రమేశ్ అడ్డుకున్నారు. అప్పటికే అక్కడికి బీజేపీ నాయకులు చేరుకున్నారు. బీజేపీ పార్టీ నాయకులు ప్రాణహిత వద్దకు ఎలా వెళ్తారని కృష్ణారావు ప్రశ్నించగా ఎవరిని కూడా అక్కడికి వెళ్లనివ్వమని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని సీఐ కోరారు. ఆయన వెనుతిరిగి కౌటాల మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. బీజేపీ నాయకుడు విజయ్ కార్యకర్తలతో కలిసి తుమ్మిడిహెట్టి వద్ద గల ప్రాణహిత నది వద్దకు కార్యకర్తలతో చేరుకున్నారు. అనంతరం కోనరు కోనప్ప అనుచరులు సైతం అక్కడికి చేసుకున్నారు.

### పోలీసులు హౌస్ అరెస్టు చేయడం సరికాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

పోలీసులు హౌస్ అరెస్టు చేయడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రాణహిత ప్రాజెక్టు కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించకపోవడానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. వీటిని ఆధారాలతో చూపేందుకే తాను బహిరంగ చర్చకు సవాల్ చేశానని తెలిపారు. తాను నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని చెప్పారు.

### ఎమ్మెల్యే డొంక తిరుగుడు వ్యవహారం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే ఎమ్మెల్యే హరీష్‌బాబు డొంక తిరుగుడు వ్యవహారం చేస్తున్నారని చెప్పారు. తాను ఎస్పీఎం పునరుద్ధరణకు తీవ్రంగా కష్టపడ్డానని తెలిపారు. ప్రస్తుతం మిల్లులో నాలుగు వేల మంది ఇతర ప్రాంతాలకు చెందిన వారు పని చేస్తున్నారని, అధికారంలో ఉన్నందున ఎమ్మెల్యే స్థానికులను తీసుకు నేలా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే కోనప్ప ప్రశ్నించారు.

### గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పాత వారినే కొనసాగించాలి

ఆసిఫాబాద్‌రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పాత వారినే కొనసా గించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శాంతికుమారి, ఊశన్న బుధవారం ఒక ప్రకనటలో కోరారు. తాత్కాలిక ఉపాధ్యాయులు రెగ్యులర్ ఉపాధ్యాయులు, అధ్యాపకులతో కలిసి అన్ని రకాల డ్యూటీలు బాధ్యతా యుతంగా పని చేస్తూ మంచి ఫలి తాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు న్యాయమైన విద్యను అందించడంలో చాలా కృషి చేస్తున్నారని తెలిపారు.

### కంకర వేశారు.. తారు మరిచారు



కంకర పోసి వదిలేసిన గుంట్లపేట రోడ్డు

పెంచికలపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): మంలంలోని గుంట్లపేట ప్రధాన రహదారిపై కాంట్రాక్టర్ కంకర పోసిన చదును తారు వేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడు. గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగు పర్చాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ దక్కించుకున్న గుత్తేదారు ఏడాది కాలం గడిచిపోయినా కిలో మీటర్ రోడ్డు పూర్తి చేయడం లేదు. గత వర్షాకాలం రోడ్డు మంజూరైన వెంటనే ఇరువైపులా మట్టి పోసి వదిలేశాడు.మండలంలోని గుంట్లపేట ప్రధాన రహదారిపై కిలోమీటర్ తారు రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ నుంచి రూ.1.10 కోట్లు 2024 జనవరిలో మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కంకర పరిచి వదిలేయడంతో రోడ్డుపై ప్రయాణం మరింత కష్టతరంగా మారింది. అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై ఐటీడీఏ ఏఈ సయ్యద్ బద్రుద్దీన్‌ను సంప్రదించగా త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేస్తామని తెలిపారు.